AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
14-5-2026 (Thursday) MAIN EDITION

## కేరళం సీఎంగా వీడీ సతీషన్..



**అక్షరటుడే, కేరళం:** కేరళం సీఎం అభ్యర్థిపై ఉత్కంఠ వీడింది. కాంగ్రెస్ అగ్రనేతల చర్చల అనంతరం వీడీ సతీషన్‌ను సీఎంగా ఎంపిక చేశారు. ఈ మేరకు దీపదాస్ మున్షీ ప్రకటించారు. కేరళంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. మే 4న వెలువడిన ఫలితాల్లో యూడీఎఫ్ 102 స్థానాల్లో గెలుపొందింది. అయితే సీఎం రేసులో సతీషన్ పాటు కేసీ వేణుగోపాల్, రమేష్ చెన్నితాల ఉన్నారు. అధిష్టానం వద్ద కేసీ వేణుగోపాల్‌కు మంచి పట్టు ఉండటంతో ఆయననే సీఎం చేస్తారని భావించారు. అయితే స్థానిక కాంగ్రెస్ నాయకులు, కూటమిలోని మిత్ర పక్షాలు సతీషన్‌ను సీఎం చేయాలని కోరారు. ఈ మేరకు సుదీర్ఘ చర్చల అనంతరం సీఎంగా సతీషన్‌ను కాంగ్రెస్ హైకమాండ్ ఖరారు చేసింది.

## హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ స్వాధీనం



**అక్షరటుడే, హైదరాబాద్:** నగరంలో డ్రగ్స్ దందా ఆగడం లేదు. యువత, విద్యార్థులు వీటికి బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. పోలీసులు దాడులు చేస్తున్నా.. గంజాయి, డ్రగ్స్ రవాణా మాత్రం ఆగడం లేదు. తాజాగా ఎక్సైజ్ అధికారులు నగరంలోని సురారంలో దాడులు చేసి.. రూ. 2.58 లక్షల విలువైన మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేశారు. ప్రవీణ్ అనే వ్యక్తి నుంచి ఎండీఎంఏ, ఎలిజర్ అలియాస్ సన్నీ నుంచి ఓజీ కుష్‌తో పాటు చరస్‌ను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

## బైకుపై విధాన్ భవన్‌కు సీఎం



**అక్షరటుడే, ముంబై:** మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ బైకుపై విధాన్ భవన్‌కు వెళ్లారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా మోటార్ సైకిల్‌పై ప్రయాణించారు. తన నివాసం వర్షా నుంచి విధాన్ భవన్‌కు స్వయంగా బైకు నడుపుకుంటూ వెళ్లారు.

## ఢిల్లీ మెట్రోలో ఉబర్ సీఈవో ప్రయాణం



**అక్షరటుడే, ఢిల్లీ:** ప్రముఖ క్యాబ్ సర్వీస్ సంస్థ 'ఉబర్' అధిపతి దారా ఖోస్రోషాహి.. ఢిల్లీలో ట్రాఫిక్ కష్టాలను తప్పించుకోవడానికి మెట్రో రైలును ఆశ్రయించారు. భారత పర్యటనలో భాగంగా ఆయన జోర్ బాగ్ స్టేషన్ నుంచి మెట్రోలో ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఢిల్లీ మెట్రో సేవలను కొనియాడారు.

## రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగర శివారులో ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. బాచుపల్లి నుంచి గండిమైసమ్మ వరకు రోడ్డు విస్తరణ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. అటవీశాఖ అధికారులు తాజాగా 19 ఎకరాల భూమిని బదలాయించారు. దీంతో రోడ్డు విస్తరణ పనులు మొదలయ్యాయి.



## చక్కెర ఎగుమతులపై నిషేధం

**అక్షరటుడే, ఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చక్కెర ఎగుమతులపై నిషేధం విధించింది. సెప్టెంబర్ 30 వరకు ఈ నిర్ణయం అమలులో ఉంటుందని పేర్కొంది. దేశీయంగా ధరలను నియంత్రించడం, స్థానిక సరఫరాలను పరిరక్షించడం, అలాగే ఉత్పత్తి, ప్రపంచ వస్తు మార్కెట్ల చుట్టూ పెరుగుతున్న అనిశ్చితికి సిద్ధపడడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చక్కెర నిషేధించింది. దేశీయ ఉత్పత్తి డిమాండ్ కంటే ఎక్కువగా ఉంటుందనే అంచనాతో ఈ సీజన్‌లో 15.9 లక్షల మెట్రిక్ టన్నుల వరకు చక్కెరను ఎగుమతి చేయడానికి గతంలో ప్రభుత్వం అనుమతించింది. అయితే తాజాగా ఎగుమతులు నిషేధించడం గమనార్హం.

## వార్షిక ద్రవ్యోల్బణం 8.3 శాతం..

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** వార్షిక ద్రవ్యోల్బణం రేటు ఏప్రిల్ 2026లో 8.3 శాతంగా నమోదైంది. వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ గణాంకాలను విడుదల చేసింది. పెరుగుదల తాత్కాలిక అంచనా మాత్రమేనని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అనేక రంగాలలో నమోదైన ధరల ఇందుకు కారణమైనట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. ముఖ్యంగా ఖనిజ నూనెలు, ముడి చమురు మరియు సహజ వాయువు విభాగంలో ధరలు గణనీయంగా పెరిగాయి. అయితే, పరిస్థితిని ప్రభుత్వం నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది.

## పీఎంజే దొంగల అరెస్ట్

**కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెలరీ షోరూమ్‌లో కాల్పులు జరిపి బీభత్సం సృష్టించిన సంచలన దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ ఘోరానికి పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన ముగ్గురు సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసు వివరాలను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మీడియాకు వెల్లడించారు. నిందితులు రెక్కి నిర్వహించి పక్కా ప్రణాళిక ప్రకారం దోపిడీ చేశారన్నారు.**

**- అక్షరటుడే, కరీంనగర్**



- కరీంనగర్‌లోని జువెల్లరీస్‌లో మే 3న దోపిడీ
- ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జ్యోతినగర్‌లో గల పీఎంజే జువెల్లరీస్‌లో ఈ నెల 3న దోపిడీ జరిగింది. నిందితులు ఉదయం దుకాణం తెరవగానే తుపాకులతో లొనికి చొరబడ్డారు. అనంతరం కాల్పులు జరిపి నగలతో పారిపోయారు. ఈ ఘటనలో పలువురు సిబ్బంది గాయపడ్డారు. ఈ కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. అంతర్రాష్ట్ర ముఠా పనిగా అనుమానించి ఇతర రాష్ట్రాల్లో సైతం గాలించారు. ఈ క్రమంలో ముగ్గురు కీలక నిందితులను బీహార్‌లో అరెస్ట్ చేశారు. కేసు వివరాలను సీపీ గౌస్ ఆలం గురువారం మీడియాకు వెల్లడించారు.

### రెండు నెలల ముందే..

ఈ దోపిడీలో మొత్తం 161 తులాల బంగారం, 112 క్యారెట్ల వజ్రాభరణాలు అపహరణకు గురైనట్లు సీపీ తెలిపారు. ఈ ముఠాకు బీహార్‌కు చెందిన సుబోధ్ సింగ్ ప్రధాన సూత్రధారి అని పేర్కొన్నారు. ఈ ముఠాపై బీహార్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ వంటి పలు రాష్ట్రాల్లో ఇప్పటికే అనేక దోపిడీ కేసులు ఉన్నాయి. దోపిడీకి రెండు నెలల ముందే నిందితులు షోరూమ్ పరిసరాల్లో రెక్కీ నిర్వహించినట్లు విచారణలో తేలింది. నేరం చేసిన తర్వాత రైళ్లు, బస్సుల ద్వారా పరారయ్యేందుకు వారు పక్కాగా స్కెచ్ వేశారు.

### మొత్తం 13 మంది నిందితులు

కేసును అత్యంత వేగంగా దర్యాప్తు చేసి, నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులను, సిబ్బందిని సీపీ గౌస్ ఆలం అభినందించారు. ఈ ముఠాలోని ఇతర సభ్యుల కోసం, మిగిలిన సొత్తు రికవరీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ చోరీలో మొత్తం 13 మంది నిందితులు పాల్గొన్నట్లు తెలిపారు. దోపిడీకి ముందు నిందితులు ధర్మపురిలో ఆశ్రయం పొందారు. నగలు చోరీ చేసిన అనంతరం 3 బృందాలుగా విడిపోయి.. ధర్మపురి వద్ద వాహనాలు వదిలి పారిపోయారు. నిందితుల నుంచి ఇప్పటి వరకు రూ.51 వేలు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీపీ తెలిపారు.

### నాలుగు చోట్ల రెక్కీ

బంగారం కొనుగోలు చేసిన వ్యాపారితో పాటు నిందితులను అరెస్టు చేశామని సీపీ తెలిపారు. పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ ముఠా చోరీలకు పాల్పడుతోందన్నారు. ఈ ముఠా సభ్యులు రెండు నెలల క్రితం నాలుగు ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించారు. చివరకు కరీంనగర్‌లో దోపిడీ చేశారని వెల్లడించారు. తెలంగాణలో ఇలాంటి తరహా దోపిడీ జరగడం ఇదే మొదటిసారి అని సీపీ తెలిపారు.

## ఏపీ సీఎం చంద్రబాబు కాన్వాయ్ కుదింపు



**అక్షరటుడే, అమరావతి:** ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. పొదుపు చర్యల్లో భాగంగా తన కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను తగ్గించారు. పెట్రోల్, డీజిల్ ఆదా చేయాలని మోదీ సూచించడంతో ఏపీ సీఎం చంద్రబాబు తన కాన్వాయ్‌లో వాహనాలను తగ్గించుకున్నారు. నాలుగు వాహనాలతో సచివాలయానికి సీఎం చంద్రబాబు వచ్చారు. సీఎం భద్రతా సిబ్బంది కోసం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశారు. సీఎంతో పాటు మంత్రుల కాన్వాయ్ సైతం తగ్గించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం కాన్వాయ్‌ను నాలుగు వాహనాలకు తగ్గించారు. మంత్రి లోకేశ్ సైతం పొదుపు చర్యలు చేపట్టారు. ఆయన ఒక్క వాహనంలో రాగా, భద్రత సిబ్బంది కోసం బస్సు ఏర్పాటు చేశారు.

## ఎర్రకోట బాంబు పేలుడు కేసు.. ఎన్ఐఏ ఛార్జిషీట్



**అక్షరటుడే, ఢిల్లీ:** ఢిల్లీలోని ఎర్రకోట వద్ద 2025 నవంబర్ 10న జరిగిన భయంకరమైన కారు బాంబు పేలుడు కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కీలక పురోగతి సాధించింది. ఈ ఘోరానికి పాల్పడిన 10 మంది నిందితులపై గురువారం ఢిల్లీలోని పాటియాలా హౌస్ ప్రత్యేక కోర్టులో ఎన్ఐఏ 7,500 పేజీల భారీ ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది. దర్యాప్తు సంస్థ నివేదిక ప్రకారం, ఈ కుట్ర వెనుక అల్‌ఖైదా అనుబంధ సంస్థ అయిన 'అన్సార్ ఘజ్వత్‌ఉల్‌హింద్' హస్తం ఉంది. వీరంతా భారత ప్రభుత్వాన్ని కూలదోసి షరియా పాలనను అమలు చేయాలనే లక్ష్యంతో "ఆపరేషన్ హెవెన్లీ హింద్" అనే కుట్రకు తెరలేపారు. తొలుత టర్కీ మీదుగా ఆఫ్ఘనిస్తాన్ వెళ్లే ప్రయత్నం విఫలమైన తర్వాత, వీరు 2022లో శ్రీనగర్‌లో రహస్యంగా సమావేశమై ఈ ఉగ్రవాద మాడ్యూల్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు ఎన్ఐఏ గుర్తించింది.

## తెలంగాణకు కొత్త రైలు సర్వీసులు

**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణలో కొత్త రైలు సర్వీసులు అందుబాటులోకి వచ్చాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న ముఖ్య గమ్యస్థానాలతో తెలంగాణను అనుసంధానించే కొత్త రైలు సర్వీసులు, పలు ఎక్స్‌ప్రెస్ సర్వీసుల క్రమబద్ధీకరణకు రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్‌లలోని తిరుపతి, ఓఖా, బెంగళూరు, బీదర్, కలబురగి, బెళగావి వంటి ప్రాంతాలకు వీక్లీ సర్వీసులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాలను, ప్రయాణికుల సౌకర్యాన్ని మెరుగుపరచడంలో నిరంతర మద్దతు అందిస్తున్న ప్రధాని మోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలిపారు.



## కేన్స్‌లో మేకప్ లేకుండా కనిపించిన ఆలియాభట్

**కేన్స్ ఫిలిం ఫెస్టివల్ వేదికపై ఆలియా భట్ తన లుక్‌తో అందరినీ ఆశ్చర్యపరిచింది. రెడ్ కార్పెట్‌పై చాలా సింపుల్‌గా, 'నో మేకప్' లుక్‌లో కనిపించి ఆకర్షించింది. ఒక ప్రత్యేకమైన డిజైనర్ గౌనులో ఆలియా మెరిసిపోగా, ఆమె ముఖం మాత్రం చాలా సహజంగా ఉంది. సాధారణంగా ఇలాంటి వేడుకల్లో కనిపించే హెవీ మేకప్‌కు భిన్నంగా ఆలియా ఈ లుక్‌ను ఎంచుకుంది. భారతీయ సౌందర్య ప్రమాణాల్లో వస్తున్న మార్పుకు ఇది నిదర్శనమని ఇండస్ట్రీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.**

**- అక్షరటుడే, సినిమాడెస్క్**




## కొత్త గనులు, కొత్త ఉద్యోగాలే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి వివేక్



**అక్షరటుడే, మంచిర్యాల:** సింగరేణికి పూర్వ వైభవం తెస్తామని మంత్రి వివేక్ వెంకట స్వామి అన్నారు. కొత్త గనులను తీసుకురావడం ద్వారా కొత్త ఉపాధి అవకాశాలను కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్మిక, ఉపాధి, గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి గురువారం మందమర్రి సింగరేణి ప్రాంతంలోని కేకే5 గని భూగర్భ విభాగానికి కార్మికులతో కలిసి వెళ్లారు. ఆయన గని లోపల పని పరిస్థితులను పరిశీలించారు. అలాగే కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. పీఆర్పీ బకాయిలకు సంబంధించిన ఆదాయపు పన్ను సమస్యలను పరిష్కరించాలని కార్మికులు కోరారు. అలాగే సొంత ఇల్లు కలిగి ఉండాలనే తమ కలను నెరవేర్చుకోవడంలో సహకరించాలని కూడా వారు విజ్ఞప్తి చేశారు.

## ట్రంప్ పర్యటన వేళ జేడీ వాన్స్‌కు 'సీక్రెట్ లెటర్'..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రస్తుతం చైనాలో పర్యటిస్తున్నారు. ఈ తరుణంలో ఆయనకు సంబంధించి ఒక ఆశ్చర్యకరమైన విషయం బయటకు వచ్చింది. ట్రంప్ విదేశీ పర్యటనలకు వెళ్లే ప్రతిసారీ, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కోసం ఒక రహస్య లేఖను రాసి ఉంచుతారట. ఈ విషయాన్ని వైట్ హౌస్ అధికారి సెబాస్టియన్ గోర్క్ తాజాగా వెల్లడించారు. వైట్‌హౌస్‌లోని తన అధికారిక 'రిజల్యూట్ డెస్క్'లో ట్రంప్ ఈ లేఖను భద్రపరుస్తారు. ఒకవేళ విదేశీ పర్యటనలో ఉన్నప్పుడు తనకు ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే, దేశ బాధ్యతలను ఎలా స్వీకరించాలి, ప్రభుత్వాన్ని ఎలా ముందుకు నడిపించాలి అనే అంశాలపై ఉపాధ్యక్షుడికి ట్రంప్ ఇందులో దిశానిర్దేశం చేస్తారని గోర్క్ వివరించారు. అయితే ప్రోటోకాల్ నిబంధనల దృష్ట్యా ఆ లేఖలోని పూర్తి వివరాలను వెల్లడించలేమన్నారు. గతంలో ట్రంప్‌పై జరిగిన వరుస హత్యాయత్నాల నేపథ్యంలో ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.